**కామెడీ కథ**

# చికెన్ గున్యా / మటన్ మేన్యా

## హోటల్ సడేమియా.
## రూం నెం.206.

**ఆ ముగ్గురూ గంట నించీ ఏదో సీరియస్‌గా చర్చిస్తున్నారు. పావు గంట గడిచింది. వాళ్ల చర్చ ముగిసింది. అరగంట తర్వాత రూం ఖాళీ చేసి వాళ్లు వెళ్లిపోయారు.**

★ ★ ★

''చికెన్ గున్యా ప్రాణాంతకం కాదు. ఏదో నాలుగు రోజులు కాస్త జ్వరం. ఓ మోస్తరు వొళ్లు నొప్పులు ఉంటాయి. ఆ తర్వాత అదే తగ్గిపోతుంది, ఏం ఆ మాత్రం ఓర్చుకోలేరా? ఇదంతా అపొజిషన్ వాళ్లు చేస్తున్న దుష్ప్రచారం. మీడియా సృష్టి. మా ప్రభుత్వం తీసుకోవాల్సిన అన్ని చర్యలు భేషుగ్గా తీసుకుంది. ప్రస్తుతం పరిస్థితి పూర్తి కంట్రోల్‌లో ఉంది'' ఇదీ ఆరోగ్యశాఖామాత్యులు శ్రీ గుండు గురవయ్యగారు ప్రెస్‌మీట్‌లో కూసిన కూతల సారాంశం.

ఆ రోజు రాత్రి గురవయ్య తన వాగ్దాటికీ అవతలి వాళ్లని వెర్రివెధవల్ని చేయగల తన నైపుణ్యానికీ తానే మురిసిపోతూ నిశ్చింతగా నిద్రపోయాడు.

తెల్లారింది. పనిమనిషి లచ్చి గది శుభ్రం చేయడానికి గురవయ్య గదిలోకి వచ్చింది. ఎవడో బీరువా తలుపు తెరుస్తుండడం గమనించి, చేతిలో చీపురుతో ''ఎవడ్రా దొంగ నా కొడకా.. ఏం కాజెయ్యాలని వొచ్చావ్‌రా ముష్టి నాయాలా! ఎంత ధైర్యంరా నీకు'' అంటూ పాత పరుపు దుమ్ము దులిపే టైప్‌లో వాడ్ని చావచితకబాది, అపరకాళిలా వాడ్ని ఎగిరి డొక్కలో తన్నబోతుంటే, అకస్మాత్తుగా ''ఓసీ నీ దుంప తెగ.. నేనే మీ అయ్యగార్ని'' అన్న గురవయ్య అరుపుకి, లచ్చి నోరెళ్లబెట్టి చూడసాగింది.

జిందా తేల్ మాలిష్ ఎడ్వర్టైజ్‌మెంట్‌లో శూలంతో కనబడే నీగ్రోగాడి కజిన్‌బ్రదర్‌లా ఉన్నాడు గురవయ్య ఆ క్షణంలో. స్థానిక పన్నులు అదనంలా.. దానికి తోడు మొహం, వొంటి నిండా ఎర్రటి కురుపులతో మూసుకుపోయిన కళ్లతో, కబడ్డీ ప్లేయర్‌లా మోకాళ్ల దాకా వంగిపోయి, కలియుగ కాముడిలా ఉన్న అతన్ని ఆ స్థితిలో అతని ఆత్మీయులు కూడా గుర్తించడం కష్టం అనేది నిష్ఠుర సత్యం.

అద్దంలో తన సుందర ముఖారవిందాన్ని చూసుకుని 'గాడ్జిల్లా'ని చూసినట్టు జడుసుకుని, మత్తుమందు లేకుండానే పైల్స్ ఆపరేషన్ చేయించుకుంటున్న పేషెంట్‌లా ఆరు గావు కేకలు పెట్టాడు.

అందచందాల్లో గురవయ్యని మించిన అతని భార్య, కూతురూ.. కొడుకూ వగైరాలు అప్పుల వాళ్లు తరుముతున్నట్టు ఆ గదిలోకొచ్చి ఒకర్నొకరు అతికష్టం మీద పోల్చుకుని. తలా ఎనిమిదేసి పొలికేకలు పెట్టసాగారు. లచ్చి కూడా ఉడతాభక్తిగా మూడు కేకలు పెట్టి తన విశ్వాసం ప్రకటించుకుంది.

సాయంత్రానికల్లా ఆ అంతుబట్టని వింత వ్యాధి వెతుక్కుంటూ వెళ్లి కొందర్ని తగులుకుంది. అదేం చిత్రమో వాళ్లంతా రాజకీయ నాయకులు! అధికార, ప్రతిపక్ష అనే తేడా లేకుండా సాధారణ ఎం.ఎల్.ఎ. నుండి సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వరకూ అందర్నీ గాఢంగా కావలించుకుంది. ఎంత మంచి 'రోగం'! ఎంత నిష్పక్షపాతి! ఎంత సమానత్వం! అలాంటి రోగాలు వర్ధిల్లాలి... ముఖ్యంగా మన నాయకుల 'రోగం' కుదర్చడానికి.

ముఖ్యమంత్రి గుటకాయస్వాహా టాయ్‌లెట్‌లో స్పృహ తప్పితే హోంమంత్రి పిచ్చి రెడ్డి పూజ చేస్తూ కళ్లు తేలేశాడు. ప్రతిపక్ష నాయకుడు గురివింజనాయుడు కాఫీ తాగుతూనే కిందపడి, స్విమ్మింగ్ ఛాంపియన్‌లా, కాళ్లు చేతులూ అదే పనిగా కొట్టుకోసాగాడు.

రాత్రికి రాత్రి అన్ని కార్పొరేట్ ఆస్పత్రులూ, మన ప్రియాతిప్రియమైన నాయకులతో, వాళ్ల బంధుకోటితో కిటకిటలాడసాగాయి. వాళ్లల్లో చాలామంది పాపం పండి, సాధారణంగా ధర్మాసుపత్రుల్లో చాలామంది రోగుల్ని నిత్యం పడేసినట్టుగానే, కారిడార్లల్లో, లెట్రిన్‌ల పక్కనా, కార్‌పార్కింగ్, స్టోర్‌రూం.. ఇలా ఒకటేమిటి ఎక్కడ కాస్త జాగా కనిపిస్తే అక్కడ వాళ్లని పడేశారు. పది ట్రెయిన్ ఏక్సిడెంట్లు ఒకేసారి జరిగిన చోటుని తలపిస్తోంది అక్కడి స్థితి.. వాతావరణం.

**మోర్తల ప్రభాకర్ రెడ్డి**

సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో కనిపించే వింత, వికృత వేషగాళ్లల్లా ఉన్నారు మన రాజకీయ నాయకులు. ఎముకల్ని మిక్సీలో వేసి పొడికొడుతున్నట్టు, కండల్ని ఖైమా కింద పేస్ట్ చేస్తున్నట్టు, నరాల్ని రంపంతో బరబరా కోస్తున్నట్టు.. తలమీద ఎవడో నిలబడి సుత్తితో అదే పనిగా బాదుతున్నట్టు.. నాలుకని గొంతులోంచి బైటికి లాగి పారేస్తున్నట్టు.. ఇంకా ఇలాగే.. మరెన్నో ఇన్‌స్టార్ట్. ఆ నరక యాతన కన్నా, చావే మేలు అనే నిర్ణయానికి వొచ్చేశారందరూ. ఎంత ఐకమత్యం! భిన్నత్వంలో ఏకత్వం అంటే అదే కాబోలు!

అందరికన్నా గుటకాయ స్వాహా, గురివింజనాయుడు, గురవయ్యల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

''డాక్టర్! ఈ బాధ భరించలేను. నాకేదైనా పెయిన్ కిల్లర్ ఇంజక్షన్ ఇవ్వండి!'' గురివింజనాయుడు అరిచాడు.

ఓ మెంటల్ హెడ్‌నర్స్ వొచ్చి ''ఎందుకలా అరుస్తారు? ఇది మీ అసెంబ్లీ కాదు హాస్పిటల్. పెయిన్ కిల్లర్ ఇంజక్షన్లకి మందు లేదు. ఊరికే అ వక మెదలకుండా పడుకోండి'' అంది విసుగ్గా. నిస్సహాయంగా పళ్లు కొరుక్కుని ''పోనీ... మత్తు మందు. ఏదైనా?'' అని దేబిరించాడు నాయుడు.

''అదీ లేదు.. కానీ మరో మార్గం ఉంది'' అని నాయుడు ఆశగా చూస్తుండగా నర్స్, పక్కనే ఉన్న బెడ్‌ప్యాన్‌తో నాలుగుసార్లు మండ మీద మోదింది. దాంతో గురివింజనాయుడి కోరిక తీరింది.

ఎలుక చచ్చిన సంఘటననే ఇంటర్నేషనల్ న్యూస్ ఐటమ్‌గా సెన్సేషనల్ న్యూస్‌గా ప్రసారం చేసే మన టీవీ ఛానెల్స్.. ఇంత అద్భుతమైన అవకాశం వస్తే వదులుతారా? పండగ జేసుకున్నారు!

డాక్టర్ల కళ్లు గప్పి, గురవయ్య మంచం చుట్టూ యమభటుల్లా మూగి ''రాష్ట్రంలో చికెన్‌గున్యా దాదాపు లేదని మీరు గతంలో అన్నారు. మరి ఇప్పుడు మీకెలా వచ్చింది? ఇది ఆ వ్యాధా? లేక..?'' అని అందరూ కోరస్‌గా అడిగారు.

గురవయ్య తన గుండు బాదుకుని ఏడుస్తూ ''అప్పట్లో అలా కూసినందుకు, ఆ చికెన్‌గున్యా ఇంకా ఉందనీ, అదెలా ఉంటుందో నాకు రుచి చూపించి, ఆ దేవుడు నా కళ్లు తెరిపించాడు మహా



ప్రభో'' అంటూ బాధతో కళ్లు మూసుకున్నాడు.

చచ్చిన పాముని చంపడం, పెట్టిన చోటే మళ్లీ మళ్లీ వాతలు పెట్టడం మన ఆనవాయితీ. అందుకే ఓ ఛానెల్ ప్రతినిధి ''ఆ వ్యాధి ప్రాణాంతకం కాదు. పెద్ద బాధా ఉండదు. ఏదో కాస్త జ్వరం వొళ్లు నొప్పులూ మాత్రం ఉంటాయని మీరన్నారు కదా. మరి మీ స్థితి చూస్తుంటే చాలా బాధ..'' ఆ వాక్యం పూర్తికాకముందే, ఆ ప్రతినిధి చెయ్యి, అనుకోకుండా గురవయ్య ఛాతీమీద కాస్త బలంగా పడడంతో, గురవయ్య రెండు నిమిషాలు నాన్‌స్టాప్‌గా 'పెడబొబ్బల' కచేరీ చేస్తూ దానికి మ్యాచింగ్‌గా చిత్రమైన 'జెర్క్‌ల' డ్యాన్స్ కూడా చేయసాగాడు.

ఓ నర్స్ తాపీగా వచ్చి గబగబా ఓ ఐదూ బై రెండు సైజు ఐస్‌గడ్డ, అతని మీద, శవపేటిక మీద మూతలా పెట్టించింది.

జర్క్‌లూ పెడబొబ్బల స్థానే, మూలుగులూ, వణుకుడూ రీప్లేస్ చేశాడు గురవయ్య.

అంత జరిగినా, ప్రతిపక్షాన్ని సపోర్ట్ చేసే ఓ ఛానెల్ ప్రతినిధి నిర్దయగా ''ఇంతకీ.. మీకు తగులుకుంది ఏ రోగం?'' అన్నాడు కంపరంగా చూస్తూ.

గురవయ్య బ్లాక్‌లో సినిమా టిక్కెట్లు అమ్మేవాడిలా ''నాకు.. తెలీదు.. మీరు తెలుసుకుని చెప్పండి'' అని గుసగుసలుగా అని ఆ పూటకి ప్రసారసమాప్తిలా కళ్లు తేలేశాడు.

అతనితో ఇక లాభం లేదని, టీవీవాళ్లు గుటకాయ స్వాహా రూం వైపు పరుగులు తీశారు. అది పసిగట్టి గుటకాయస్వాహా 'ఐ.సి.యూ'లోకి మకాం మార్చాడు. ఓ ఛానెల్ ప్రతినిధి ''ఐ టూ కెన్ సీయూ!'' అని అరుస్తూ పరుగుతీశాడు. గత్యంతరం లేక గుటకాయ స్వాహా, ఆపరేషన్ థియేటర్‌లో సెటిల్ అయ్యాడు. నాలుగు రోజుల దాకా బైట ఎర్రబల్బ్ వెలుగుతూనే ఉండాలనీ, ఛస్తే తలుపులు తీయకూడదని చాలా వీక్‌గా చెప్పి గట్టిగా చెంపలేసుకున్నాడు.

ఆ హాస్పిటల్ చీఫ్ పరమశివం, గుటకాయ స్వాహాతో ''సార్ ఈసారి ఎలాగైనా నిమ్స్ చీఫ్‌గా, మా మావ నమఃశివాయని నియమించాలి'' అని నంగి నంగిగా అన్నాడు.

''కుదరదు.. నేను ఆల్‌రెడీ ఒకర్ని..'' అని గుటకాయ స్వాహా కోపంగా అని అనగానే, పరమశివం ''సరే మీ ఇష్టం'' అంటూ చేతిలోని రబ్బర్ సుత్తితో గుటకాయస్వాహా మోకాళ్లు.. మోచేతుల మీద కసిదీరా నాలుగేసి దెబ్బలు వేశాడు.

స్వాహాకి పరమశివం ఫర్‌దర్ ప్రోగ్రాం అర్థమైపోయింది. బాధతో మెలికలు తిరుగుతూ ''క్షమించు పరమశివం.. ఏదో నోరు జారాను. నీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. ఇంకా ఏమైనా నేను చెయ్యాల్సినవి ఉంటే చెప్పు. జూబ్లీహిల్స్‌లో మీ హాస్పిటల్‌కి వందెకరాల స్థలం ఇవ్వమంటావా?'' అంటూ అతికష్టం మీద అన్నాడు.

ఆ ఆపరేషన్ థియేటర్‌లోనే కేబినెట్ అత్యవసర సమావేశం ఏర్పాటైంది. స్పృహలో ఉన్న నలుగురు మంత్రుల్ని అలాగే స్ట్రెచ్చర్ల మీద తీసుకొచ్చారు. అందరూ మంచాల మీద పడుకునే కార్యక్రమం కొనసాగించారు.

ఇంతలో చీఫ్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీ గబగబా రూంలోకొచ్చారు. ''సార్ మీకొచ్చిన జబ్బు పేరు మటన్ మేన్యా! ఇది చికెన్ గున్యా కన్నా ప్రమాదకరమైంది. ప్రాణాంతకం కూడా'' అని హెల్త్ సెక్రటరీ చక్రవర్తి చెప్పగానే అంతా హాహాకారాలు చేయసాగారు.

''మేం ప్రపంచ ఆరోగ్య సంస్థ సాయం కోరాం. అన్ని దేశాలతో సంప్రదిస్తున్నాం. వాళ్ల అంచనా ప్రకారం.. 'ఆఫ్రికానో అవస్థో' అనే దోమ, చికెన్ గున్యా సోకిన రోగులను కరిచినప్పుడు అలాంటి

వాళ్ల రక్తంలో ఉండే ఓ పదార్థం వల్ల, ఆ దోమకి పూనకం లాంటిది వచ్చి అది చిత్రంగా ప్రవర్తిస్తుంది'' అంటూ ఆగాడు చక్రవర్తి.

''చిత్రంగా ఏం చేస్తుందేం? వెతుక్కుంటూ వెళ్లి కేవలం రాజకీయ నాయకుల్నే కరుస్తుందా?'' వ్యంగ్యంగా అన్నాడు గురవయ్య.

''ఒక రకంగా అలాంటిదే. కలుషిత రక్తం. శరీరంలో పేరుకుపోయిన ఇతర మాలిన్యాల ప్రభావంతో ఉత్పన్నమయ్యే ఓ రకం వాసన ఆ దోమని విపరీతంగా ఆకర్షిస్తుంది. ఎవరి నుంచి ఆ వాసన వెలువడితే వాళ్లను ఆ దోమ పదే పదే కరుస్తుంది. అలాంటి వాళ్లల్లో రాజకీయ నాయకులు ఎక్కువగా ఉండటం యాదృచ్ఛికం. మనమేం చెయ్యగలం?'' పాఠం అప్పగించినట్టు చెప్పాడు చక్రవర్తి.

అది విని అందరికీ మొదట ఆశ్చర్యం, సిగ్గు ఆ తర్వాత కోపం ఉక్రోషం కలిగాయి. కానీ అవతల ఉన్నది దోమ. ఎవరేం చేస్తారు?

''ఇంతకీ దానికి విరుగుడు ఏదైనా ఏడ్చిచచ్చిందా? లేక ఇలా ఏడుస్తూ మేం చావడమేనుందా?'' గుటకాయ స్వాహా అరిచి వెంటనే ''అమ్మా!'' అంటూ మూలిగాడు.

''అమెరికా వాళ్ల కథనం ప్రకారం పాతికేళ్ల క్రితం ఓసారి సైబీరియా సముద్రంలోని 'అరిచి ఛస్తాన్' అనే దీవిలో ఈ జబ్బు మహమ్మారిలా ప్రబలి అక్కడి ప్రభుత్వం కుప్పకూలిందట. మచ్చుకి ఒక మంత్రి మిగల్లేదట. చాలాకాలం వరకూ అక్కడ రాజకీయ నాయకులు అనే వారే లేకుండా పోయారట'' చక్రవర్తి మాటలకి అంతా అవాక్కయ్యారు. బాధ కన్నా భయం ఎక్కువైంది వాళ్లకి.

''ఏదో పరిష్కారం తప్పక ఉంటుంది. ఎలాగైనా ఈ జబ్బుకి విరుగుడు కనుక్కోవాలి'' బిక్కచచ్చి అన్నాడు గురవయ్య.

''విరుగుడు మందుకు పరిశోధన చాలా తీవ్రంగా సాగుతోంది. ప్రపంచంలోని అన్ని మందుల కంపెనీలను వైద్య ఆరోగ్య సంస్థలని సంప్రదిస్తున్నాం. అయినా నాదో విన్నపం... ఆ దోమలు మిమ్మల్ని మళ్లీ మళ్లీ కుట్టకుండా తగు జాగ్రత్తలు మొదట తీసుకోవాలి. చికెన్ గున్యా కంట్రోల్ చేయనంత వరకూ ఫలితం శూన్యం! దేవుడి దయ వల్ల.. మీరు ఏ మందూ అవసరం లేకుండానే బైటపడినా ఆ దోమలు మిమ్మల్ని మళ్లీ కుట్టవనీ మీరు మళ్లీ.. ఇదే స్థితిలో ఉండరని ఏంటి గ్యారెంటీ?'' చీఫ్ సెక్రటరీ కల్పించుకుంటూ అన్నాడు.




''అవును అదీ నిజమే. మావోయిస్టుల నుంచి అంటే ఎలాగో మనల్ని మనం రక్షించుకోగలం. కానీ ఆ మటన్ మేన్యా దోమనెలా తప్పించుకుంటాం?'' హోం మినిస్టర్ దిగులుగా అన్నాడు.

''మరి ఇప్పుడేం చేద్దామయ్యా?'' విసుగ్గా అన్నాడు గుటకాయస్వాహా. అతని మెదడు మొద్దుబారి పోయింది. భయం.. బాధతో అతను ఏదీ సవ్యంగా ఆలోచించలేకపోతున్నాడు.

''సార్ అందుకు మార్గం.. మొదట మురికివాడల నిర్మూలన. పారిశుధ్యానికి ప్రాధాన్యత, పేద ప్రజలకి పక్కా ఇళ్లూ... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలూ...'' అంటూ ఓ లిస్టు చదవసాగాడు చక్రవర్తి.

''అబ్బ! ఆపవయ్యా నీ దండకం. అవన్నీ చెయ్యాలంటే ఎంత డబ్బు?'' అని గుటకాయ స్వాహా అనగానే ''కనీసం ఐదువేల కోట్ల అవసరం అవుతుంది'' చీఫ్ సెక్రటరీ నింపాదిగా అన్నాడు. ఇంతలో కుడికాలు నరం తెగుతున్న ఫీలింగ్ కలగడంతో ''ఐదు కాకపోతే పదివేల కోట్లు తగలెయ్యండయ్యా. సీ.ఎం.గారూ మీరు కూడా ఏంటండీ? అసలు మనం ఉంటామో పోతామో తెలీక ఛస్తుంటే మీ పిసినారితనం పాడుగానూ..'' బాధతో అరిచాడు గురవయ్య.

''ఎందుకైనా మంచిది ప్రతిపక్షం వాళ్లతో కూడా ఓ మాట చెప్పి..'' మిగతాది పూర్తి చెయ్యలేక గుటకాయస్వాహా మూలిగాడు.

చీఫ్ సెక్రటరీ, చక్రవర్తి ఇద్దరూ పక్కవార్డ్‌లోకి వెళ్లారు. రెండు నిమిషాలు కూడా కాకముందే ''పది కాకపోతే.. పాతికవేల కోట్లు ఖర్చు చేయండి. మేం కిక్కురుమనం. మా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం. ముందు మమ్మల్ని ఈ నరకం నించి రక్షించండి బాబో!'' అంటూ గురివింజనాయుడు, ఇతర ప్రతిపక్ష నాయకులు అరిచిన అరుపులు ఆంధ్రదేశం అంతా వినిపించసాగాయి. అలాంటి స్థితిలోనూ గురవయ్యా, పిచ్చిరెడ్డి ఎలాగో నవ్వి... ఆ తర్వాత గుక్కపెట్టి ఏడవసాగారు.

ఆ తర్వాత యుద్ధ ప్రాతిపదికమీద పనులు జరగసాగాయి. రాష్ట్రంలో చాలా మురికివాడలు మాయమై వాటి స్థానే పక్కా ఇళ్లతో, చక్కటి వసతులతో పేదలకు కాలనీలు ఏర్పడసాగాయి. ఆరోగ్య కేంద్రాలూ ముఖ్యంగా అన్ని సమయాల్లో.. కావల్సిన మందులతో, సిబ్బందీ, ప్రజలకు అందుబాటులో ఉండసాగారు. పేదవాళ్ల జీవన విధానం మెరుగుపడడానికి కావల్సిన వాతావరణం క్రమేపీ నెలకొనసాగింది. చికెన్ గున్యా మటుమాయమైంది!

గాంధీ జయంతి సందర్భంగా విడుదలయ్యే ఖైదీల్లా మన 'పుణ్య పురుషులు' ఒక్కొక్కరే హాస్పిటల్స్ నించి బైటికి రాసాగారు.

మటన్ మేన్యా పుణ్యమా అని పేదలూ సామాన్యులూ తమ స్థితిగతిలో వచ్చిన మార్పుకి ఆ దోమకి చేతులెత్తి మొక్కారు.

★ ★ ★

## ఉపసంహారం:

నెలన్నర తరువాత హోటల్ సదేమియాలో మళ్లీ ఆ ముగ్గురు కలిశారు. సంతోషంగా ఒకర్నొకరు కౌగిలించుకున్నారు. అందులో మొదటి వ్యక్తి ఓ సైంటిస్ట్.. మటన్ మేన్యా వైరస్ సృష్టి కర్త. రెండో వ్యక్తి ఓ ప్రముఖ లేబర్ యూనియన్ లీడర్. రాజకీయ నాయకులందరి ఇళ్లకూ వైరస్ ఇంజెక్ట్ చేసిన పాల ప్యాకెట్లు సరఫరా చేయించడంలో పాత్రధారి. ఇక, పేదలకూ సామాన్య ప్రజానీకానికి కొంతైనా మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ఆ కథంతా నడిపిన అసలు సూత్రధారి- హెల్త్ సెక్రటరీ చక్రవర్తి!

